# ఊరేగింపు

ఒక ప్రొద్దు తక్కువ రోజున, సూర్యుడస్తమించ బోయేవేళ, చీకటి నీడ చూసి భూమి వొణికిపోతున్న తరుణంలో -

గ్రామ చావిడిలో గోవిందు భీకరాకారాన్నిచూసి, జూదంలో అతినితోటి ఆటగాళ్ళు ముగ్గురూ గడగడ లాడారు. ఆత్రయంలో ఒకడు గోవిందు మీద ఒక నెపం వేయటం, సీమటపాకాయల వత్తిని వెలిగించి నట్లయింది. గోవిందు ముక్కలు గుర్తుపెట్టుకొని ఆడుతున్నాట్ట. దాంతో గోవిందు ప్రళయకాలరుద్రుడై పోయాడు. చేతిలోని పేకముక్కలు వాడిముఖాన విసరికొట్టాడు. షర్టుకాలరు పట్టుకొని గుంజాడు. ఊఁచిపుచ్చుకు లెంపకాయ కొట్టాడు. కిమన్నాస్తి. అందరూ బిక్కుబిక్కుమని అలాగే కూర్చున్నారు.

కోపంతో రోజుతూ గోవిందు చావడిదాటి వచ్చాడు. చలిగాలి వ్యంగ్య దూషణలాగా విసరికొట్టింది. విసుక్కుని నుదుటిమీదపడే ఉంగరాలజుట్టుని వెనక్కి తోసుకుని ముందుకు నడిచాడు. కొంతదూరం చెరువు గట్టుమీద నడిచేసరికి ఎదురుగా వగరుస్తూ పరిగెత్తి వస్తున్న ఆబోతు కనిపించింది. పక్కకు తప్పుకున్నాడు. ఆబోతుని తరుముతూ దాని వెనకే పరిగెత్తి వస్తున్న కోటేశ్వరరావునిచూసి గోవిందు వెకిలిగా నవ్వాడు.

'నోరులేని జంతువు వెంట పడకపోతే తిన్నది అరగదా?'

కోటేశ్వరరావు గోవిందువంక అసహ్యంగా చూసి, ఓసారి పైపంచ దులిపి మళ్ళీ వేసుకున్నాడు.

'పూలమొక్కల్నీ, పాదుల్నీ తొక్కివేస్తూ తేరగా మెక్కి తిరిగే ఆబోతుకి వత్తాసు పుచ్చుకొన్నావేమిటి కథ?'

గోవిందుముఖం చిట్లించుకున్నాడు.

'అనేదేదో స్పష్టంగా అనరాదూ?'

'అనేందు కేముందీ! అచ్చుపోసిన ఆబోతుని పొగరణిగేదాకా గ్రామం గ్రామం తరిమి తరిమి కొట్టకపోతే, ఊరు పాడుపెట్టుకు పోవలసిందేగా!' రాజసం ఉట్టిపడుతుండగా కోటేశ్వర్రావు కంచుగంట కొట్టినట్టు అన్నాడు. గోవిందు ముఖం ఎర్రబడ్డది. కోటేశ్వర్రావు పంచాయితీబోర్డు ప్రెసిడెంటు తమ్ముడు. మూడు రోజుల కిందట గోవిందు తాగి లల్లాయిపదం పాడుతూ ప్రసిడెంటు కండువా లాగితే, అతను చుట్టకొరికి తుపుక్కున గోవిందు ముఖంమీద ఉమ్మేశాట్ట! ప్రతీకారంగా క్రితంరాత్రి ప్రెసిడెంటు మెరక పొలంలోని కూరగాయమొక్కలు గోవిందు పెరికించేశాడు. కోటేశ్వ ర్రావు మాటలు అతనికి ఉక్రోషం కలిగించాయి.

'అబ్బో, మాటల్తోనే బాంబులు వేస్తున్నావే? ఉత్తర సరిహద్దుకి పోరాదూ? అని ఎత్తిపొడుపుగా అంటూ భుజంమీద తట్టినట్టు చెయ్యేసి గోవిందు కోటేశ్వర్రావుని బలంగా నెట్టాడు. కోటేశ్వర్రావు తమాయించుకోలేక గట్టుమీదినించి జారి బురదలో పడ్డాడు, గోవిందు వెకిలిగా నవ్వాడు. 'అరె, అలా పడిపోయావేం! మీ పాలేరుకి చెప్తాలే, కొత్తగుడ్డలు తెస్తాడు.'

కోటేశ్వర్రావు ఏదో తిట్టు తిట్టాడు. నిర్లక్ష్యంగా గోవిందు ముందుకి సాగి పోయాడు. ఊరు మలుపుకి తిరిగేసరికి చంద్రయ్య కనిపించాడు.

'ఏం చంద్రయ్యా, జాగిలమేదీ?

'జాగిలమా?'

'అదేలే, ఊరకుక్క.'

'ఊరకుక్కా?' అన్నాడు చంద్రయ్య పళ్ళు బిగబట్టి.

'ఏం వినపడదా! రోజూ కుక్కతో షికారు తిరుగుతావుగా. ఇవాళ ఒంట రిగా వచ్చావేం?'

చంద్రయ్య మునసబుగారి మేనల్లుడు. సరదాగా సీమకుక్కని పెంచు తున్నాడు. రోజూ దాన్ని వీధుల్లో తిప్పటం అతని కలవాటు. దానికేదో జబ్బుచేస్తే వెటెరినరీ హాస్పటల్లో మందు వేయించటానికి పట్నం తీసుకు వెళ్ళాడు. కాని అది అక్కడే చచ్చిపోయింది.

'అది చచ్చిపోయిందిగా' అన్నాడతను.

'చచ్చిందా? ఎవరినైనా కరిస్తే చంపారా? అది అరిచే కుక్కేగాని కరిచే కుక్కకాదే!' ముసిముసిగా నవ్వుతూ అన్నాడు గోవిందు.

మునసబుగారమ్మాయి దేవాలయంనించి వస్తుంటే గోవిందు ఫొటోతీశాడని కొంత అలజడి రేగింది. అసలు విషయం పొక్కటం ఇష్టంలేక, మున సబు మరోనెపంతో గోవిందుని 'ఖబడ్దార్' అన్నాడు. గోవిందు మనసులో విషయం చంద్రయ్య పసిగట్టాడు.

కరిచే కుక్కల్ని కాల్చి పారెయ్యటానికి నా దగ్గర లైసెన్సు ఉన్న గన్ ఉంది గోవిందూ.' అన్నాడు చంద్రయ్య మర్మగర్భితంగా.

'అబ్బో, గన్ను చూస్తే నాకు భయం' అని వ్యంగ్యంగా అంటూ ముందుకు సాగి, చంద్రయ్య కాలుకి కాలు అడ్డంపెట్టి మెలికవేశాడు గోవిందు. చంద్రయ్య తగు జాగ్రత్తలో ఉండకపోవటంవల్ల పడిపోయాడు. అతన్ని లేవనెత్తుతూ 'సారీ! సంజ చీకట్లో కళ్ళు కనిపించలేదు చంద్రయ్యా' అని గోవిందు ముందుకివెళ్ళాడు. చంద్రయ్య పళ్ళుకొరకటం అతనికి స్పష్టంగా వినిపించింది.

ఊళ్ళో మర్రిచెట్టు దగ్గరికి రాగానే కరణంగారి పెద్దబ్బాయి కనిపించాడు. ఆయన అజాగ్రత్తగా నడుస్తుండగా, గోవిందు ప్రక్కన మురికిగుంటలో

పొర్లుతున్న వరాహాన్ని అదిలించాడు. అది బెదిరి పారిపోతూ కరుణాకరం ధోవతీ, లాల్చీ వంకిలం చేసింది.

'అరెరె, శుభ్రమైన బట్టల్ని బురదకొట్టి పాడైపోయాయి.' అన్నాడు గోవిందు నవ్వు ఆపుకోటానికి పెద్దప్రయత్నం చేయకుండా. కరుణాకరం అతనివైపు అసహ్యంతో చూశాడు.

'పరవాలేదులే గోవిందూ, అభిరుచినిబట్టి లోకంలో బురదకొట్టేవాళ్ళు కొందరూ, పన్నీరు చల్లేవాళ్ళు కొందరూ ఉంటారు. దానికేమిటి ?' అన్నాడు.

అదే మురికిగుంటదగ్గిర రెండురోజుల క్రిందటే గోవిందు తాగిపడిఉంటే అతని తల్లి శాంతమ్మ అందరిలోనూ తలదించుకొని అతన్ని నెమ్మదిగా ఇంట్లోకి తీసుకవెళ్ళింది. గోవిందుకి ఉక్రోషం వచ్చింది. అతననుకున్నది వేరు కరుణాకరంమీద అతను ఒక అపవాదు పుట్టించాడు. అతనికి నాటకాలమీద మోజుఉంది. నాటకాల మిషతో పట్నంలో అతడు ఒకయువతిని మోసంచేసి అన్యాయం చేశాడని కరుణాకరంమీద కక్షతో నీలాపనింద వేశాడు గోవిందు.

'ఔనౌను, అర్హతనుబట్టి_'

ఆ మాటలు వినేసరికి కరుణాకరంకి ఒళ్ళు మండింది. మౌనంగా అతను క్రిందిపెదవి కొరికి గబగబ వెళ్ళిపోయాడు. గోవిందు నవ్వుకొని ముందుకి అడుగేశాడు. కొంతదూరం వెళ్ళగానే దేవాలయంలోని గంటలు వినిపించాయి. ఒక క్షణం తటపటాయించి అతను గుళ్ళోకి వెళ్ళాడు. గుడివెనక కోనేరు, కోనేరుచుట్టూ పూలతోట సుందర దృశ్యాలు. గోవిందు సరాసరి పూలతోటలోకి వెళ్ళాడు. ఆ దారిన వచ్చినప్పుడు తోటలోని గులాబీ పువ్వు ఒకటి కోసుకుని వాసనచూస్తూ వీధిలో నడిచి పోవటం అతని కలవాటు.

తోటలోకి రాగానే మెరుపు మెరసినట్లయి గోవిందు కళ్ళు మిరుమిట్లు గొల్పాయి. కోనేటిగట్టుమీద విలబడివున్న ఒక ఆకృతి అతన్ని పరవశింప చేసింది। విరిసిన మల్లెపూలలో ఒక గులాబిపువ్వు. అదే జానకి వర్ణన. పాల నురగలాంటి తెల్లచీర, తెల్లచోళి, నల్లటి కురులలో ఒక గులాబీ పువ్వు. నిత్యం అదే ఆమె అలంకరణ.

గోవిందు మనసులోని మధురభావన ఒక్క క్షణం మాత్రం నిలిచి అదృశ్య మైంది. ఆమె మోతుబరిరైతు సర్వయ్య కుమార్తె. గోవిందు ఆమెను కాంక్షించాడు. తమ కుటుంబాలమధ్య గల పరిచయాన్ని పురస్కరించు కొని ఆ మధ్య తల్లిచేత వివాహానికి రాయబారం పంపాడు.

గోవిందులో ఏం చూసి పిల్లనివ్వ మంటావు శాంతమ్మా?' అన్నాడు నరసయ్య. శాంతమ్మ మారుమాట్లాడలేకపోయింది.

'వాళ్ళకి ఇష్టం లేదట' అంది ఆమె. నరసయ్య అన్నమాటలు ఆమె గోవిందుకు చెప్పలేదు. అతని ఆశ అడియాసైంది. నోటికి వచ్చినట్టు నరసయ్యను తిట్టాడు, బుసలుకొట్టాడు. అతని అంతు కనుక్కుంటా నన్నాడు. మరింత తాగుబోతు, జూదరి అయ్యాడు. జానకిని చూడగానే గతమంతా అతనికి స్మృతిలో మెదిలింది. ఆవేశంతో అప్పుడేకోసిన గులాబీ పువ్వుని మోటుగా లాక్కుని ముళ్ళకంచెమీదికి విసిరివేశాడు.

ఈ సంఘటనకి జానకి అప్రతిభురాలైంది. ఆమెకి గోవిందుని గురించి అంతా తెలుసు. నల్లటి కళ్ళెత్తి అతనివైపుచూసి, ఆమె నెమ్మదిగా అంది.

'పువ్వుని చెట్టుకైనా ఉంచాలి, లేక కోస్తే దైవానికి సమర్పించాలి. లేక పోతే జడలో పెట్టుకొనేవాళ్ళని పెట్టుకోనివ్వాలి. ముళ్ళకంపమీద పారె య్యటం దేనికి?'

'నువ్వు నాకు కావాలి.' అన్నాడతను కోపంగా. జానకి ఒక్క క్షణం ఆలో చించింది. చప్పున ఒక ఆలోచన ఆమె మనసులో తళుక్కుమంది.

'ఆ ముళ్ళకంపమీద పారేసిన నా గులాబిపువ్వు నాకు తెచ్చి యిచ్చింతరవాత ఏమైనా మాట్లాడటం సబబు.'

ఆమె కళ్ళలోకి తీక్షణంగా చూశాడు. ఆమె మందహాసం చేసింది. గోవిందు చప్పున ముళ్ళకంప దగ్గరికి వెళ్ళి ఆ పువ్వు తియ్యాలని ప్రయత్నించాడు. అది కంప మధ్యన పడటంవల్ల అతనికి అందలేదు. పట్టుదలగా ప్రయత్నించాడు. ముళ్ళు అతని చేతుల్నీ, చెంపల్నీ చీరాయి. ఎలాగో పువ్వు అందుకున్నాడు, కాని రెక్కలన్నీ చాలమట్టుకు విడిపోయాయి. ఆ మిగిలిన భాగాన్నే తీసుకుని కోనేటిదగ్గరికి వచ్చాడు. జానకి కనపడలేదు. ఆమె తనని వంచించి పారిపోయిందన్నమాట. కోపం తెప్పించుకోవాలన్నా ఎందుకో అతనికి ఆమెమీద కోపం రావటంలేదు. జాలిగొల్పుతున్న ఆ గులాబిపూవుని వదలిపెట్టటానికి అతనికి ఎందుకో మనసొప్పలేదు. జేబులో వేసుకున్నాడు. శక్తిఅంతా లాగేసినట్టు అడుగు ముందుకి పడలేదు. ఎలాగో నెమ్మదిగా నడిచి దేవాలయం బయటికివచ్చి ఇంటివైపు దారితీశాడు. అతని ఆలోచనలన్నీ జానకిమీదనే నిలిచిపోయాయి. ఎంత హుందాగా మాట్లాడింది! ఎంత అర్థవంతంగా ఆమాటలంది! ఆ దృశ్యం తలచుకుంటే తనకి బ్యాటరీ ఛార్జీచేసినట్టు నరనరాల్లో ఏవో శక్తి నిండుతోంది.

పరధ్యానంగా అడుగులు వేస్తూ గోవిందు తన ఇంటికి సమీపంగావచ్చేసరికి ఎదురుగుండా బాజా బజంత్రీలతో ఏవో ఊరేగింపు వస్తోంది. పరకాయించి చూశాడు. అవతలి వీధిలోని రామయ్యగారి కుమార్తె వివాహం. పెళ్ళికూతురు తలవంచుకుని ఉంది. 'సిగ్గు కాబోలు' అనుకుంటూ ఇంట్లోకి వెళ్ళాడు గోవిందు.

ఇంట్లో ప్రవేశించిన గోవిందుకి గుండె గతుక్కుమంది. శాంతమ్మ నట్టింట్లో చాపమీద కూర్చుని ఉంది.

ఇంట్లో దీపం లేదు. మసక చీకటిగా ఉంది.

'నువ్వేనా నాయనా ?' అంది శాంతమ్మ అలికిడి విని.

'బయట బ్రహ్మాండంగా ఊరేగింపు జరుగుతుంటే చూడకుండా నట్టింట్లో కూర్చుని ఏం చేస్తున్నావమ్మా ?'

"ఏదో కూర్చుండి పోయాను అలా' అంటూ శాంతమ్మ దీపం వెలిగించ టానికి లేచి నిలబడ్డది. అదే క్షణంలో ఊరేగింపు తాలూకు గ్యాస్‌లైట్ కాంతి కిటికీగుండా ప్రసరించింది. ఆ కాంతిలో శాంతమ్మ కనుకొలుకుల్లో కన్నీరు గోవిందుకి కొత్త కాకపోయినా ఆ క్షణంలో అతని హృదయం ఆర్ద్రమైంది. ఆలోచన తనని గురించేనని అతనికి తెలుసు. ఆ ఆలోచన మరల్చాలని అతను నవ్వుతూ అన్నాడు.

'అదేమిటమ్మా, రామయ్య అలాంటి సంబంధం తెచ్చాడు. కాకిముక్కుకి దొండపండులా ఉంది. అందుకే కాబోలు ఆ అమ్మాయి పాపం సిగ్గుపడి తలొంచుకు కూర్చుంది.'

శాంతమ్మ దీపం వెలిగించి కొడుకువైపు చూసింది. 'అదేంమాటరా ! ఆ అమ్మాయి అతగాడిని ఏరికోరి చేసుకుంటోంది. అతగాడికి మిలిటరీలో మంచి ఉద్యోగమట, తుపాకి దెబ్బలో మొనగాడట. కోరిన మొగుడు దొరికాడని సిగ్గు' అందామె.

గోవిందు మాట్లాడలేదు. శాంతమ్మ మళ్ళీ అంది.

'నువ్వలా పెళ్ళికొడుకువై ఊరేగుతుంటే చూడాలని ఎంత తపించిపోతు న్నానో ఆ ఘడియ అంత వెనక్కుపోతుంది.'

ఆమె నిట్టూర్పు విన్నాడు గోవిందు. అతని కళ్ళల్లో జానకి మెదిలింది. అప్రయత్నంగా 'జానకి–' అన్నాడు.

ఏవో నిస్పృహ నైరాశ్యం శాంతమ్మలో పెల్లుబికాయి.

'ఆ నరసయ్య అంత మాటన్నతరవాత ఇంకా జానకి, జానకి, అని పలవరిస్తావేంరా ?' చిరాగ్గా అంది.

'ఏమన్నాడు ?' అన్నాడు గోవిందు.

'ఏం చూచుకుని పిల్లనివ్వమంటావమ్మా' అన్నాడు. అవమానంతో చచ్చిపోయాను అని నాలుక కరచుకొంది శాంతమ్మ.

గోవిందు ముఖంలోకి రక్తం చిమ్మింది.

'ఈమాట ఇదివరకెందుకు చెప్పలేదు' అన్నాడు కోపంగా. శాంతమ్మ సమాధానం ఇవ్వలేదు. పైశాచికపు టాలోచనలు గోవిందు మనసులో మెదిలాయి. జానకిని బలాత్కారంగా వివాహమాడితే—? ఉఁహుఁ—అసంభవం, సిగ్గుతో తలవంచుకున్న వధువు అతని ఊహలో మెదిలింది. ఊరు ఊరంతా కళ్ళముందు గిర్రున తిరిగింది.

తెల్లారి శాంతమ్మ లేచి చూసేసరికి గోవిందు పక్కమీద లేడు. అంత పెందరాళే లేచే అలవాటు అతనికి చిన్నప్పుడే పోయింది. ఎక్కడికో వెళ్ళివుంటాడని ఆమె అప్పటికి సరిపెట్టుకుంది. కాని ఆరోజూ, మర్నాడూకూడా అతను రాలేదు. శాంతమ్మ గాభరాపడ్డది. గ్రామ పెద్దలతో చెప్పింది.

'ఎక్కడికి పోతాడు వాడే వస్తాడులే' అన్నారందరూ.

'తెల్లారి కనిపిస్తే మక్కలిరగ్గొడతానని భయపడ్డాడు పిరికిపంద, అనుకున్నాడు ప్రెసిడెంటు తమ్ముడు కోటేశ్వర్రావు.

'పైన పటారం, లోన లొటారం' ఈసడింపుగానవ్వుకున్నాడు చంద్రయ్య.

'పని పడ్తానని భయపడ్డాడు కాబోలు' అనుకున్నాడు కరుణాకరం.

ఏ వ్యక్తినైనా కొందరు అభిమానించటం, కొందరు అసహ్యించుకోటం సహజంగా జరుగుతూ వుండేదే. కాని గోవిందుపట్ల అంతా ఏకాభిప్రాయంతోనే ఉన్నట్లు శాంతమ్మకు తెలుసు. ఆమె గుండెలు తరుక్కుపోయేట్లు ఏడిచింది. 'పీడ విరగడై'పోయిందని లోలోపల సంతోషిస్తున్నట్టు ఆమెకి

అందరూ అన్యాపదేశంగా చెబుతూనే ఉన్నారు. స్కూల్ ఫైనల్ దాకా చదువుపట్ల ఎంతో శ్రద్ధాసక్తులు చూపిన గోవిందు, తండ్రిపోగానే చదువుకు స్వస్తిచెప్పి, ఏచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెడుతూ ఇలా ఎందుకూ కొరగాని వాడవుతాడని ఆమె యెప్పుడూ అనుకోలేదు, విధివైపరీత్యానికి దుఃఖిస్తూ రోజులు గడపటమే తనకి శరణ్యమని నిర్ణయించుకున్న తరుణంలో గోవిందు దగ్గర్నించి ఆమెకి ఉత్తరం వచ్చింది. ఆతను సైన్యంలో చేరానని రాశాడు. అడ్రసు వ్రాయలేదు. ఈ వార్త ఊరివారందరికి ఆశ్చర్యాన్ని కలిగించింది. గోవిందు దగ్గర్నుంచి వచ్చింది ఆ ఒక్క ఉత్తరమే. తర్వాత అత నెక్కడున్నాడో, ఏమైనాడో కూడా తెలియలేదు.

సంవత్సరం గడిచింది.

రెండు సంవత్సరాలు గడిచాయి.

మూడో సంవత్సరం జరుగుతోంది.

గోవిందు ఆచూకీ ఏమీలేదు. క్రమంగా ఊరు అతన్ని మర్చిపోయింది.

ఆగష్టు. జానకి వివాహం నిర్ణయమైంది. వరుడు ఎం. బి., బి. యస్. ప్యాసైనాడు. శాంతమ్మ ఆ విషయం వింది. గోవిందు ఆమె స్మృతిలో మెదిలాడు. 'ఏం చూసి పిల్లనివ్వమంటావమ్మా ?' అని జానకి తండ్రి అన్నమాటలు ఆమె హృదయంలో బాణాల్లా గుచ్చుకోసాగాయి. 'చేతి కందివచ్చిన బిడ్డ ఎలా ఐపోయాడా !' అని ఆమె కన్నీరు కార్చింది.

బాజా భజంత్రీలతో ఊరేగింపు వాకిట్లోంచి వెడుతుంటే శాంతమ్మ కిటికీ దగ్గర నిలబడి చూసింది, జానకి పెళ్ళి. బంగారు బొమ్మలావుంది. సరిగా చదువుకుంటే గోవిందు కేంలోటు ? పెళ్ళికొడుకుకంటే గోవిందు ఎన్నోరెట్లు అందగాడు. కాని దురదృష్టం వాడిన వెన్నాడుతోంది. బిడ్డ ఎక్కడ ఏం అవస్థలు పడుతున్నాడో ! శాంతమ్మ విచారంతో అలాగే కిటికీ కమ్మలకి ఆనుకుని నిలబడిపోయింది.

రోజులు గడిచిపోతున్నాయి.

ఒక ప్రొద్దుతక్కువరోజున సూర్యుడు పైపైకి వస్తున్నవేళ, భూమి వెలుగుతో గర్వంగా నవ్వుతున్న తరుణంలో—

గ్రామ చావడిమీదుగా ఊరేగింపు ఒకటి వస్తోంది. అదే సమయంలో ఊళ్ళోకి వేగంగా ఒక టాక్సీ పరిగెడుతోంది. టాక్సీకి ఊరేగింపు అడ్డమైంది. బాజా భజంత్రీలు చెవులు దిబ్బెళ్ళువేసేట్టు మ్రోగుతున్నాయి. చేసేదిలేక టాక్సీ ఒక ప్రక్కకి ఆపి, నిలబడ్డాడు టాక్సీలోని వ్యక్తి.

'ఏమిటండీ అది ?' కారులోని స్త్రీ అడిగింది.

'ఏవో ఊరేగింపు. అది సాగిపోతేగాని మన కారు కదలదు,' అన్నాడు అతను కొంచెం విసుగ్గా.

ఆమె కారు కిటికీలోంచి తల బయటికిపెట్టి చూసింది. ఊరేగింపు బాగా దగ్గరైంది. అలంకరించబడిన లారీలో కొందరు వ్యక్తులు కూర్చుని ఉన్నారు. వాళ్ళని గుర్తుపట్టడానికి ప్రయత్నిస్తోంది ఆమె. ఆ నిలబడిఉన్న వాళ్ళు- పంచాయతీ బోర్డు ప్రెసిడెంటు, కరణం. మునసుబు... ఇంకా అతను కోటేశ్వర్రావు- చంద్రయ్య... కరుణాకరం .. ఆ కూర్చుని ఉన్న స్త్రీ ? ఆమె పరకాయించి చూసింది .... సరిగా పోల్చుకోలేకపోతోంది.

'ఊరేగింపు చూస్తావా ?' అంటూ కారులోంచి దిగిన ఆ వ్యక్తి కారుతలుపు తీశాడు. ఆమె కారు దిగింది. క్రమక్రమంగా అలంకృతమైన లారీ దగ్గరౌతోంది.

'ఏమిటండీ ఈ ఊరేగింపు ?'

ఆ గ్రామవాసి గర్వంగా తలెత్తి ఏదో చెప్పబోతూ 'నువ్వా జానకమ్మా!' అన్నాడు.

'అవును తాతా, ఏమిటిదంతా ?' అంది ఆమె—జానకి.

'మన గ్రామానికి గర్వకారణం. నేటికి ఈ గ్రామం ఆంధ్రదేశానికి తలమానికమై నిలిచిందమ్మా. దుర్మార్గంగా దేశాన్ని ఆక్రమించుకోటానికి

Vishw Shanthi Reading Room
Mirzaguda, ...

ముందుకొస్తున్న శత్రువు టాంకులు ఆరింటిని సర్వనాశనంచేసిన మహా వీరుడు మనవాడేనమ్మా. అతని పరాక్రమానికీ, సాహసానికీ మెచ్చి దేశంలోని అత్యున్నతమైన సాహస ప్రశంసాచిహ్నం పరమవీరచక్ర ప్రభుత్వం అతనికి బహూకరించిందమ్మా.' ఆనందంతో గద్గదమైన స్వరంతో అన్నాడతను.

'ఎవరా వీరుడు?' అంది జానకి అతని గర్వాన్ని పంచుకొంటున్నస్వరంతో.

'సరి, పేరు చెప్పనే లేదా? అడుగో చూడు. అక్కడ – ఆ వేదికమీద కూర్చున్నదెవరు? మన శాంతమ్మగారుకదూ? ఆమె పుత్రరత్నమే. ఆ గోవిందే – ఔనమ్మా–మన గోవిందే ఆ పరమవీరచక్ర పొందిన ఘనుడు.'

'ఆఁ!'

జానకి అప్రవిభురాలైంది.

వేదికవైపు అలాగే చూడసాగిందామె. కాని ఆమెకి గోవిందు కనిపించలేదు.

'ఏడీ అతను?'

ఆ గ్రామవాసి కంఠం రుద్ధమైంది.

'ఇంకెక్కడి గోవింద్? వీరస్వర్గంలో ఉన్నాడమ్మా. మరణానంతరం అతనికి ప్రభుత్వం బిరుదు ఇచ్చింది. పటాన్ని ఊరేగించుకుంటున్నాము. ఉడతాభక్తి. అంతకంటె ఏం చేయగలం?'

జానకి ముఖం ఒక్కసారిగా నల్లబడి పోయింది. వేదిక ఆమెకి బాగా దగ్గరగా వచ్చింది. పటంవైపు చూసింది. అది పూలతో మునిగిపోయిఉంది. వేదిక క్రమంగా ముందుకివచ్చి ఆమెని దాటిపోబోతున్నది, తటాలున జడలోని గులాబిపువ్వు తీసి పటంవైపు విసిరింది. కాని అది పటం చేరలేదు. సూర్యకాంతిలో మెరుస్తూ రెండు కన్నీటి చుక్కలు ఆమె కనుకొలకుల్లోంచి క్రిందికి రాలాయి. అది స్పష్టంగా చూసిన శాంతమ్మ కళ్ళు తుడుచుకుంది.

ఊరేగింపు ముందుకి సాగిపోయింది.

—o— (1966)